

# చికిత్స

పరావల రామచంద్రయ్య

*ఉన్నవాళ్ళకు, లేనివాళ్ళకు కూడా ఒకటే న్యాయం ఉండాలనడం సబబు కాదు. ఉన్నవాళ్ళవద్దనుంచి రాబట్టక పోతే లేనివాళ్ళకు ఉపకారం జరగదు. ఏమైనా స్వయంగా అన్నగారే డబ్బు అడిగితే మనస్సు చివుక్కు మనదూ?*

---


ఆ రోజు రోజంతా డాక్టరు రామకృష్ణగారింట్లో ఆయన చెల్లెలు లక్ష్మీకాంతమ్మ వాగ్ధోరణికి ఆనకట్ట అంటూ లేకపోయింది. ఇంట్లో వాళ్ళూ, పనిమనుషులూ, ఆస్పత్రిలో నర్సులు వగైరాలంతా ఆవిడకు ప్రేక్షకులుగా ఉండి తమ విధ్యుక్తధర్మాన్ని యథోచితంగా నిర్వహించారు.


ఇంతకూ లక్ష్మీకాంతమ్మ వాగ్ధోరణి ఏ రాజకీయ పక్షానికో సంబంధించినది కాదు; మరే స్త్రీల హక్కుల పోరాటం తాలూకుదీ కాదు. లేక ఏ దివంగత కవి సాహిత్యం మీదో జరిగే తర్జన భర్జన కూడా కాదు.

మరేమిటయ్యా అంటే—

అదో పురాణం. అయితే మనం మామూలుగా

శంకర్




# చికిత్స

చదివే పురాణాలు దేవతలకు సంబంధించినవి; కేవలం కల్పనలతో కూడుకొన్నటువంటివి. కాగా, ప్రస్తుతం లక్ష్మీకాంతమ్మ చదువుతున్న పురాణం మానవులకు సంబంధించినది. వాస్తవికతతో కూడుకున్నటువంటిది.

ఏతత్పురాణ కాలక్షేపంలో లక్ష్మీకాంతమ్మ తన అన్నగారైన డాక్టరుగారినే మన్నించి వదిలిపెట్టలేదు. చదివిన డాక్టరీ చదువునూ, ప్రాక్టీసునూ, తన్మూలంగా లభించే డబ్బునూ బహు ఘోరంగా వృథా చేస్తున్నందుకు అయిన్నకూడా నాలుగు వడ్డించింది. బుద్ధినేరక ఆయన తరఫున వకాల్తా పుచ్చుకోబోయిన నర్సు కమలమ్మ వెంట్రుకవాసిలో తప్పించుకుంది, చావు తప్పి కన్ను లొట్టబోయినట్లు.

"అసలు మన బంగారం మంచిది కానప్పుడు పరాయివాళ్ళను అనీ ఏం లాభం లేదమ్మా, కమలమ్మా! లేకపోతే, లోకంలో ఎంతమంది డాక్టర్లు లేరు? వాళ్ళంతా ఎర్రనీళ్ళు సూదుల్లో ఎక్కించి పచ్చ నోట్లు ఇట్టే పుచ్చుకోవటం లేదూ? వాళ్ళూ ఈయనలాగే డబ్బు అడగవలసి వచ్చినప్పుడు శుద్ధ బుద్ధావతారాల్లాగా కూచుంటే, యిహ దేశంలో ఉన్న మెడికల్ కాలేజీలన్నీ ఒక్క రోజులో మూతబడిపోవూ?" అంది లక్ష్మీకాంతమ్మ, తనొక మహత్తర సత్యాన్ని వెల్లడిస్తున్నట్లుగా. అంతటి సత్యాన్ని వెల్లడించినందుకు గాను, ఆవిడ కమలమ్మ వద్ద నుంచీ తగు మోతాదులో ఒక మెచ్చుకోలును—"అసలైన మాట చెప్పారండీ మీరు!" అన్న ప్రశంసా వాక్యాన్ని—ఆశించింది. అలా ఆశించటంలో బేసబబు ఏముంది గనక?

కాని కమలమ్మ ఆ మాత్రం గమనించకుండా, ఆవిడ ఆశ అన్నిటినీ అడియాసలు చేస్తూ, "మీ మాటలు నే నొప్పుకోనండీ" అంది. ఇహ లక్ష్మీకాంతమ్మకు కోపం వచ్చిందంటే రాదా మరి?

"ఎందుకు ఒప్పుకోనంట?" అని కమలమ్మను నిలేసి అడిగిం దావిడ.

"మా డాక్టరుగారు ధర్మరాజు లాంటివారు. ఊళ్ళో అందరూ ఆయన పేరు చెబితే చేయెత్తి నమస్కారం చేస్తారు. అలాంటి డాక్టరుగారు ఈ రోజున మీ కొక్కత్తెకు మాత్రం చెడ్డగా కనిపించారు మరి!" అంది సమాధానంగా కమలమ్మ.

ఈ మాటలతో లక్ష్మీకాంతమ్మ కోపం మరో మెట్టు పైకెక్కింది.

"చాల్లేవమ్మా, నువ్వు చెప్పొచ్చావు; గానీ? చేయెత్తి నమస్కారం చేస్తారూ? ఎందుకు చెయ్యరూ మరి? డబ్బూ దస్కం అడక్కుండా, ఈ శతాబ్దానికి నేనే దానకర్ణుడినంటూ తేరగా వైద్యం చేస్తుంటే సరి? అందుకే

కొంప ఏనాటికీ పైకి రాకుండా ఉంది. బయట పల్లకీలమోతా, ఇంట్లో ఈగలమోతా" అంది ఆవిడ.

తన అన్నగారి 'కొంప' పైకి రావటం లేదని లక్ష్మీకాంతమ్మ అంతగా విచారపడటం మెచ్చుకో దగ్గది. కాని ఆ కుటుంబాన్ని గురించి 'ఇంట్లో ఈగల మోత' అని ఆవిడ వ్యాఖ్యానించటంలో మట్టుకు నిజం లేదు. పైగా మూడు పూవులు ఆరు కాయలుగా జరుగుతూంది. నిప్పు కను అమ్మ అన్నట్టు ధర్మరాజులాంటివాడని పేరుం డటంచేత కావచ్చు, పట్టుదలతో అంటిపెట్టిన చెయ్యి కావటంచేత కావచ్చు, డాక్టరు రామ కృష్ణగారి కున్నంత పేరూ, ప్రఖ్యాతీ ఆ పట్నంలో మరో డాక్టరుకు లేదు. మిగతా డాక్ట ర్లకుమల్లే డబ్బు విషయంలో నిక్కచ్చి మనిషి కాకపోవటంవల్ల, లేదా లేక్క ఆయన దగ్గరికే వస్తారు. రోగం నయమయిన తరువాత, ఆయన అడక్కపోయినా ఆయనను సంతోష పెట్టేందుకో, లేక తమ ఆత్మ సంతృప్తి కోసమో, తమ తాహతునుబట్టి ముట్టచెప్పి పోతుంటారు. ఇక డబ్బున్న వాళ్ళు కూడా ఆయన ప్రతిభనుబట్టి, విధ్యుక్త ధర్మ నిర్వ హణలో ఆయన చూపించే ఆసక్తినిబట్టి ఆయనవద్దకే వస్తారు.

అలా డబ్బున్న వాళ్ళ దగ్గర్నుంచి మాత్రం డాక్టరుగారు కాస్త ఎక్కువగానే రాబడతారని ప్రతీతి. మనుష్యుల తీరునుబట్టి, నోరునుబట్టి ఎవరు ఉన్నవాళ్ళో, ఎవరు లేనివాళ్ళో ఆయన ఇట్టే పట్టివేయగలరని చాలామంది అంటారు.

ఏమైతే నేమి? ఆయన ఆదాయానికి లోటు లేదు. పెద్దవాళ్ళు గతించిపోగా, చెట్టు కొకరు పుట్ట కొకరుగా ఉన్న ఆ సంసారం ఆయనవల్లనే, ఆయన సంపాదనవల్లనే ఒక దారికి వచ్చింది. ఆ సంపాదనతోనే ఆయన తన చెల్లెలు లక్ష్మీ కాంతమ్మకు అఖండ వైభవంతో, లక్షాధికారు లతో సంబంధం కలిపి పెళ్ళి చేశారు. పోతే, ఇక వర్తమానంలో కూడా ఆయన జీవితంలో వెలితిపడ్డ దేమీలేదు. సమృద్ధిగా సంపదా, కష్ట సుఖాల్లో చక్కగా అర్థం చేసుకుని హృదయ మంతటితోనూ ఆరాధించగల ఇల్లాలు సావిత్రీ, అరవిచ్చిన పూల మొగ్గల్లాంటి పిల్లలూ— వీటన్నింటితో కలకలలాడే సంసారం.

ఇలాంటి పచ్చని సంసారాన్ని పట్టుకుని, 'పైకిరాని కొంప' అంటే, ఏ ఇల్లాలి హృద యం బాధపడదు? ముందరి హాల్లో వింటుని, లక్ష్మీకాంతమ్మ మాటలు వింటున్న సావిత్రికి బాధతోపాటు రవంత కోపం కూడా వచ్చింది, వదినెగారిమీద.

"అవేం మాటలు వదినా?" అంది సావిత్రి, కొంచెం మందలింపు ధ్వనించే స్వరంతో.

"నేనేమన్నానమ్మా యిప్పుడు? అందరూ యిలా నామీదికే వస్తా రేమిటే, కయ్యానికి కాలు దువ్వే పోట్లగిత్తల్లాగ? అవున్లే! ఉన్న మాట మొహాన్నే అనటం నాది పొరబాటు. బుద్ధిమాలినదాన్ని. ఇదుగో తల్లీ, ఇలాంటి విష యాల్లో ఇహ నేను నోరెత్తితే ఒట్టు పెట్టిందే ఒట్టు. బుద్ధి, బుద్ధి."

ఆ విధంగా లక్ష్మీకాంతమ్మ ధోరణి కనకమ్మ మీదనుంచి సావిత్రిమీదికి మళ్ళింది. కనకమ్మ తను తప్పించుకునందుకోనే భగవంతుడికి జోహార్లర్పించింది. సావిత్రిని కూడా తప్పించ మని ప్రార్థించింది.

అదే సమయానికి సావిత్రి తమ్ముడు శివుడు తను నాగానర్చిన ఇంగ్లీషు పద్యాన్ని ఉచ్చారణసాధ్యంలో వినోదం చేస్తూ ఆ దారిని రావటం సంభవించింది. ఆ సందర్భంలో, లక్ష్మీ కాంతమ్మ సాధింపులనుంచి సావిత్రిని తప్పించ వలసిందిగా సర్వ్య కమలమ్మ చేస్తున్న ప్రార్థన పార్వతి చెవిలో పడింది.

"నిన్నాలా?" అంది శివుడితో పార్వతి.

విన్పించనట్టు ఊరాపాడు శివుడు.

"మరి భక్తురాలి ప్రార్థన వింటూ కూడా ఊరికే కూచున్నారేం, ఏదో ఒకటి చెయ్యక?"

"ఆ చేసే దేదో నువ్వే చెయ్యరాదూ?" అన్నాడు శివుడు.

"నాకేం తోచటంలేదు—ఆ లక్ష్మీ కాంతమ్మ ధోరణి చూస్తూంటే."

శివుడు నవ్వాడు.

పార్వతి బుంగమూతి పెట్టింది.

"పిచ్చిదానా! అటు చూడు" అన్నాడు శివుడు, డాక్టరు రామకృష్ణగారి పెరట్లో ఉన్న తోటవేపు చూపిస్తూ.

"అక్కడేముంది? మామూలు తోట. మన హిమవన్నగంమీది తోటలకన్నా అది గొప్పదా ఏం?"

"తోటను గురించి కాదు, నే చెబుతున్నది. ఆ తోటలో ఉన్న దెవరో చూడు."

తోటలో డాక్టరుగారి పద్నాలుగేళ్ళ కూతురు లలిత, తమ్ముడు కిష్టయితో కబుర్లు చెప్పు కుంటూంది.

"అందులో విశేష మేమిటే?" అంది పార్వతి కనుబొమలు ముడిచి.

"ఏం లేదు. ఆ కుర్రవాళ్ళను వాకిట్లో లక్ష్మీకాంతమ్మ వాగ్వాదం చేస్తున్న చోటికి చేర్చు" అన్నాడు శివుడు.

పార్వతి అలాగే చేసింది.

తమ మేనత్త లక్ష్మీకాంతమ్మ ఎవరినో కంచుకంఠంతో స్తోత్రం చేస్తుండటం వినబడితే, అదేమిటో చూద్దామని వాకిట్లోకి వచ్చారు అక్కా, తమ్ముడూ. వాళ్ళు వచ్చేసరికి ఆవిడ మరదలు సావిత్రి మీద ఇందాకటి డైలాగు చదివి, అఖర్ని ఒట్టు పెట్టుకుని 'బుద్ధి, బుద్ధి' అంటూ లెంపలు వేసుకుంటున్న దృశ్యం వాళ్ళకు కనబడింది.

వాళ్ళకు నవ్వాగలేదు. కిసుక్కున నవ్వేశారు.

(తరువాయి 45వ పేజీలో)


ఆదాయము కావాలంటే



ఇంటిపట్టునే కూర్చుని, సరిక్రొత్త విధాన సొమ్ము ఆదాచేయుండి. దీన్ని చెప్పుటకు ప్రత్యేక గ్రంథం — అందరు చదవండి. రు. 5/—

266 పే. 180 బొమ్మలు, అందమైన ఫుల్ కాలికో బైండు. లేబాలంపు రు. 3-50, కట్టింపులు రు. 1/—, రహస్యసోధిని రు. 0—62. తు 4. తెలుగు వి. పి. ఖర్చులు.

జి. స్వామిరావుచౌదరి,

మోపర్రు, తెనాలి తాలూకా.

క్యాలెండర్లు

నాణ్యమైన: ఫోటో ఆఫ్‌సెట్ క్యాలెం డర్లకు మమ్ము సంప్రదించండి. క్యాలెం డరు బొమ్మలకు క్యాలెండరు మాయొక్క పార్టీలకు, ప్రింటర్లకు ప్రత్యేక ధరలు సప్లయిచేయుదుము. మంచి కమీషన్‌పై పనిచేయుటకు సమర్థులైన ఏజంట్లు కావలెను. వ్రాయుండి:

**Ajanta Art Calendar Mfg. Co.,**
**P.B. 255, Madras-1.**
**or P. B. 962, Calcutta-1.**

**SWASTIK.**

పాదముల దురద
చర్మము దురద

మీ చర్మము యొక్క దురద, మంట మీకు పూర్తి గా అశాంతి కలిగించుచున్నదా? మీ చర్మము పగిలి, రక్తము కారుచున్నదా? పాదముల వేళ్ళసందున పగుళ్ళు ఏర్పడినవా? ఇట్టి పగుళ్ళు యింకనూ హెచ్చుచున్నవా? ఇట్టి చర్మ వ్యాధు లను కలిగించు క్రిమి పేర్కొను నామములతో వ్యవహరించ బడుచున్నది. మీ చర్మ వ్యాధులు పూర్తిగా తొలగుటకు అందుకు కారణభూతములైన క్రిమి సంతతిని నశింప చేయవలయును. శాస్త్రోక్త ముగా తయారైన నిక్సోడెర్మ (NIXODERM)తో మొదటి పూతకే దురదతగ్గి, క్రిములు నశించి చర్మము యథా ప్రకాశముగా మృదువై ఉజ్జ్వల మగును. నిక్సోడెర్మ (NIXODERM) అయత్నముగా దురదను పోగొట్టి, కాళ్ళ పగుళ్ళు నయము చేయుటకు తోడ్పడి తడితడ గజ్జి, మొటిమలు, పీడ, దురదలు, తామర మొదలగు కారిటి చర్మ వ్యాధులనుగూడ నయము చేయును. మీకు పూర్తి గా గుణమునిచ్చు, సంతృప్తి కరమగు నిక్సోడెర్మ (NIXODERM)ను నేడే మీ కెమిస్టువద్ద కొనుడు.

# చికిత్స

( 7 వ పేజి తరువాయి)

లక్ష్మీకాంతమ్మ అటువేపు తిరిగేసరికి, నవ్వాపుకోలేని తమ్ముడి చెవి మెలిపెడుతూ, తాను కూడా నవ్వాపుకోలేక పైటకొంగు నోట్లో కుక్కుకుంటున్న లలిత ఆవిడ కళ్ళబడ్డది.

''భడవల్లారా! మీకూ నవ్వొస్తూందా, నన్ను చూస్తే? ఉండండి. వచ్చి మీ పని పడతా'' అంటూ ఆవిడ సావిత్రినీ, కమలమ్మనూ వాళ్ళ మానాన వాళ్ళను వదిలేసి, దగ్గర్లో కనిపించిన కొబ్బరిమట్ట తీసుకుని ఆ కుర్రవాళ్ళమీదికి పరుగెత్తింది.

సావిత్రీ, కమలమ్మా తెప్పరిల్లి ఒకరి మొహం ఒకరు చూచుకున్నారు. తన ప్రార్థన సఫలమయినందుకు కమలమ్మ సంతోషించింది. ఇక ఆ చిన్నవాళ్ళిద్దరి విషయమూ అంటే— వాళ్ళ కేం భయంలేదు. వాళ్ళు లక్ష్మీకాంతమ్మకు దొరకరు. ఆవిడను మూడు చెరువుల నీళ్ళు తాగిస్తారు. డాక్టరుగారి అన్నతోబాటు ఆ కుటుంబంలో కూడా పదేళ్ళ సాన్నిహిత్యం ఉన్న కమలమ్మ కీ సంగతి బాగా తెలుసు.

చివరికంతే జరిగింది కూడా. అలా వాళ్ళిద్దర్నీ తరుముకుంటూ పోయినలక్ష్మీకాంతమ్మ తోటల్లో, పొలాల్లో, కాంపౌండులో వాళ్ళవెంట పరుగెత్తలేక కాళ్ళు నొప్పులు పుట్టి వరండాలో కూలబడింది, ఆ యింట్లో కుర్రకుంకలక్కూడా తన మాటంటే విలువలేకపోయిందని గట్టిగా స్వగతం చెప్పుకుంటూ.

అసలీ గొడవ కంతటికీ ఒక విధంగా కారణమైన రామిగాడూ, వాడి భార్య లచ్చిమీ కాంపౌండులోని కొబ్బరిచెట్ల వెనకాల దాక్కుని ఈ నాటకమంతా చూస్తూనే ఉన్నారు.

మామూలుగానే లక్ష్మీకాంతమ్మ నోరు కాస్త పెలుసైనది. తండ్రి బ్రతికుండగా ఆవిడ థర్డు ఫారం దాకా చదివి మానేసింది. కాని ఆపాటి చదువుకు తగిన సంస్కారమేనా ఆవిడలో కనిపించదు. డాక్టరుగా రింట్లో ఆవిడకూ, కాలేజీలో చదివి దానితోబాటు వినయమూ, విజ్ఞానమూ అలవరుచుకున్న సావిత్రికీ తరచుగా చిన్న చిన్న సంఘర్షణలు వస్తూనే ఉంటాయి.

అత్తవా రింటినుంచి ఆవిడ పుట్టింటికి వచ్చి నాలుగు రోజులయింది. ఈ నాలుగు రోజులూ వల్లమాలిన సందడితో కాంపౌండు గోడలు ప్రతిధ్వనిస్తున్నాయి. ఆవిడ కొన్ని రోజులుగా ఏదో జీర్ణకోశ వ్యాధితో బాధపడతూంది. అందుకు చికిత్స చేయించుకునేందుకు అన్నగారి దగ్గరికి వచ్చింది.

ఆవిడకు ఆపరేషన్ చెయ్యవలసి ఉందనీ, ఓ వారం రోజుల్లో చేస్తాననీ చెప్పారు డాక్టరుగారు. ఇదే సంగతి బావగారికి కూడా జాబు వ్రాసి, ఆపరేషన్ చేయకముందు గాని, చేశాక గాని ఓ మారు తీరుబాటు చేసుకుని వచ్చి అందరినీ చూచి వెళ్ళవలసిందిగా వ్రాశారు.

ఈలోగా డాక్టరుగా రింట్లో పనిమనిషి లచ్చిమికి జ్వరం వచ్చింది. డాక్టరుగారు ఆస్పత్రికి [illegible] తాగించాడు. తగ్గలేదు. మరింత ఎక్కువయింది. తరువాత ఏడెనిమిది మంచి ఇంజక్షన్లు చేశారు. అప్పటికి గాని జ్వరం తగ్గుముఖం పట్టలేదు లచ్చిమికి. ఆ తర్వాత రెండు మూడు రోజుల్లో బాగా కోలుకుంది లచ్చిమి.

అప్పుడు లచ్చిమికి ఇచ్చిన ఇంజక్షన్లు చాలా ఖరీదైనవని డాక్టరుగారు మాటల సందర్భంలో సావిత్రితో అన్నారు. ఈ సంగతులన్నీ దాచుకోకుండా సావిత్రికి చెప్తేస్తుంటా రాయన. ఆ చెప్పటం కూడా ఖరీదయిన ఇంజక్షన్లు పనిమనిషికి వేశామన్న భావంతో కాదు. యాధాలాపంగా, తన ధర్మాన్ని తాను నిర్వర్తించానన్న తృప్తితో, గర్వంతో చెప్పారు. సావిత్రి కూడా సంతోషించింది.

కాని అక్కడే ప్రారంభమైంది రగడ. ఈ వైనం డాక్టరుగారు సావిత్రితో చెబుతున్నప్పుడు లక్ష్మీకాంతమ్మ విన్నది. విని భగ్గుమన్నది. పనిమనిషికి కూడా ఆస్పత్రిలో మందులా? అందులోనూ ఖరీదయిన ఇంజక్షన్లా? ఇంతకన్నా ఘోరం ఇంకేమన్నా ఉందా? అనిపించింది లక్ష్మీకాంతమ్మకు.

ఆవిడ, డాక్టరుగారు ఆస్పత్రికి వెళ్ళేంతవరకు మాత్రం ఎలాగో ఉగ్గబట్టుకుని ఉండి, ఆ తరువాత తారామండలానికి లేచింది.

వనిమళ్లే వెళ్ళి, ''ఏమమ్మా మరదలా? ప్రాక్టీసు మొదలెట్టింది లగాయతూ ఇలాగే వైద్యం చేస్తున్నాడా మీ ఆయన? అయితే ఈ లెక్కన ఈపాటికి ఏమాత్రం ఆస్తి కరగదీసి ఉంటాడంటావు?'' అంది, వంటింట్లో వంట మనిషికి కూరలు పురమాయిస్తున్న సావిత్రితో.

మొదట్లో ఈ మాటలు సావిత్రికి అర్థం కాకపోయినా, కోపం తెప్పించాయి. తన భర్తకు ఆయన తల్లితండ్రులు ఇచ్చిపోయిన ఆస్తి ఏపాటిది? ఆ కొద్దిపాటి ఆస్తి కూడా ఆయన హయాంలో విస్తరించిందే గాని ఏమాత్రం తరిగిపోలేదు. ఒకవేళ తరిగిపోయి ఉన్నా, ఈవిడెవరు అడగటానికి? ఎవళ్ళ హద్దుల్లో వాళ్ళు ఉండటం మంచిది కాదూ? ఈ యింటికి తన భర్త మకుటంలేని మహారాజు, తాను గృహిణి. ఇప్పు డీవిడ వేలుపెట్టి చూపించవలసిన అగత్యమేమిటి గనక?

సావిత్రి నెమ్మదస్తురాలు. ఈ సన్నివేశంలో వదినెగారిమీద వచ్చిన కోపం నిగ్రహించుకునేపాటి సంస్కారం ఆమెలో లోపించలేదు. కాని, పక్కనే వంటమనిషి ఉండటంవల్ల ఇప్పుడు తాను మౌనం వహించితే చులకన కావలసి వస్తుందనిపించి, వదినెగారికి తగు మోతాదులో


## క్యాలెండర్లు

నాణ్యమైన ఫోటోఆఫ్‌సెట్ క్యాలెండర్లకు మమ్మల్ని సంప్రదించండి. క్యాలెండరు బొమ్మలను క్యాలెండరు మాన్యుఫ్యాక్చరర్లకు, ప్రింటర్లకు ప్రత్యేక ధరలకు సప్లయి చేయుదుము.

మంచి కమీషన్‌పై పనిచేయుటకు సమర్థులైన ఏజంట్లు కావలెను. వ్రాయండి

ELITE CALENDAR CO.,
P.B. 1927, MADRAS-1

SWASTIK.

## మీరు నిద్రించునప్పుడు ఉబ్బసపు తెమడను సడలించును

దీపిరి దిగదీయుట, దగ్గు, శ్లేష్మము, గొంతు నొప్పి, ఉబ్బసము, రొమ్ము పడిశము, జలుబు మరియు తాపజ్వరము మొదలగు వ్యాధులతో బాధపడు వేలకొలది రోగులు యిక వీటికి భయపడనవసరములేదు. అమెరికా దేశపు ఆధునిక ఔషధముతో శాస్త్రోక్తముగా తయారైన ఈమందు, గుండె, ముక్కు మొదలగు భాగములకు రక్తము ద్వారా వ్యాపించి శ్లేష్మమును హరించును. మీకు వెంటనే ఊపిరి బాగుగావచ్చును. దగ్గు శ్లేష్మము తగ్గి పసిబిడ్డవలె నిద్రించగలరు. పూర్తిగా తృప్తి నిచ్చుటకు గ్యారంటీ యివ్వబడిన మెండకో (MENDACO)ను మీ కెమిస్టువద్ద కొనండి.

## మంచి పుస్తకాలు

జీవిత రహస్యాలు:- మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు:-...... రూ. 3-50.
యువతి:- స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు.......రూ. 3-50.
సంతానము:- గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు.............రూ. 3-50.
ఉద్యమిక రహస్యాలు:- వ్యాపారంలో లక్షలు సంపాదించే అనేక కొత్తదారులు. రూ. 6-00
ఉద్యోగదర్శిని:- మనదేశంలోని అన్నిరకాల ఉద్యోగాలు, అర్హతలు, పొందే మార్గాలు.రూ.5-00
ఆత్మజ్ఞానము:- శరీరానంతరం ఆత్మను గురించిన నవీన శాస్త్ర పరిశోధనలు. రూ. 2-50.
పోష్టు ఖర్చులుచితం. క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి.పి. పోస్టుద్వారా మీయింటికి పంపబడును.

దేశసేవ ప్రచురణలు, ఏలూరు, ఆంధ్ర

## మంచి రహస్యం

గ్లోరియా ద్రవాన్ని, మీ ముఖానికి రుద్ది తుడిచినంతలో అద్భుతమైన కాంతిని, మంచి అందాన్ని వెంటనే తెచ్చును. ముఖంలో ముదిరూపును పోగొట్టి చక్కని లేతదనాన్ని తెచ్చును ఎండకువచ్చే నలుపును, మొటిమలను నమ్మకంగా పోగొట్టును వెల రూ 1-75. అన్ని షాపుల్లో దొరుకును.

JANITA PRODUCTS, ELURU. A.P.

# ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# దీపావళి కథల పోటీ

## 1,200 రూపాయలు బహుమతులు

ప్రతి ఏడాదివలెనే శుభకృతు సంవత్సరంలో కూడా దీపావళి సందర్భంలో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కథల పోటీ నిర్వహిస్తున్నదని ప్రకటించడానికి ఆనందిస్తున్నాము.

1961 దీపావళి కథల పోటీకి రు 1,000 ల బహుమతులు ఇచ్చాము. రచయితలు అందజేస్తున్న సహాయ సహకారాలకు కృతజ్ఞతతో, రచయితలకు ఇతోధికమైన ప్రోత్సాహమివ్వడానికి 1962 దీపావళి కథల పోటీకి రు 1,200 ల బహుమతులు ఇవ్వాలని సంకల్పించాము.

తెలుగు రచయితలు ఈ అవకాశం వినియోగించుకొని, పాఠకులకు ఉత్తమమైన కథలు సమర్పించాలనే మా పూనిక విజయవంతంగా నెరవేరడానికి తోడ్పడాలని అర్థిస్తున్నాము.

**మొదటి బహుమతి రు500లు: రెండవ బహుమతి రు300లు**

**మూడవ బహుమతి రు 200 లు**

**రెండు కన్సొలేషన్ బహుమతులు : చెరొక రు 100 లు**

దీపావళి కథల పోటీలో పాల్గొనేవారు పాటించవలసిన నిబంధనలు:

1. రచన అరఠావు సైజులో 10-12 పేజీలకు మించరాదు.
2. సిరాతో కాగితానికి ఒక ప్రక్కనే వ్రాయాలి.
3. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
4. సాంఘిక, చారిత్రిక ఇతివృత్తం ఏదైనా ఎన్నుకోవచ్చు.
5. అనువాదాలు అంగీకరించబడవు. స్వీయరచనలు మాత్రమే పంపాలి.
6. బహుమతి పొందని కథలలో ప్రచుర ణార్హమైనవి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
7. బహుమతి పొందని రచనలలో ప్రచుర ణార్హం కాని వాటిని రచయితలకు త్రిప్పిపంపగలము.
8. పోటీకి రచన పంపేటప్పుడు కవరు మీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.

బహుమతి పొందిన కథలను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించగలము

దీపావళి కథల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరి తేది | **1962 సెప్టెంబరు 25**

ఎడిటర్


జవాబు చెప్పింది.

"నువ్వనే దేమిటో నాకు అర్థం కావటం లేదు వదినా. ఈ యింటికి కాపురానికి వచ్చి నప్పట్నుంచీ కూడా నేను, నా భర్త ఆస్తిపాస్తుల్ని గురించి ఒక్క రోజైనా ఆలోచించిన పాపాన పోలేదు. *ఈ రోజున మాకులేని ఆదుర్దాను* కూడా కూడగట్టుకుని నువ్వు అడుగు తున్నావు. మంచిదే. కాని, ఎంత పెరిగిందో, ఎంత తరిగిందో మా అన్నయ్యనే అడిగి లెక్కలు తేల్చుకోవటం మంచిది" అన్నది సావిత్రి ప్రతి మాటా నొక్కి పలుకుతూ.

ఆ మాటల్లో 'ఇది మా ఇల్లు, మా ఆస్తి. దాని ఎదుగు బొదుగులను గురించి సంజాయిషీ అడిగేటందుకు నువ్వెవత్తెవి? నీ కేమిటి సంబంధం?' అన్న తాత్పర్యం ధనుర్ముక్త మయిన బాణంలా శబ్దించింది.

లక్ష్మీకాంతమ్మకు దిగ్భ్రాంతి కలిగింది. ఎప్పుడూ పది మాటల కొక్కమాట గాని *సమాధానం చెప్పని మరదలు ఇంత బలమయిన* జవాబు ఇస్తుందనుకోలేదు ఆవిడ. అందుచేత కాస్సేపు నోట మాటరాక విల్చుండిపోయింది.

కాని ఆ దిగ్భ్రాంతి క్షణంపాటే!

మరుక్షణంలోనే తేరుకుని, "హాయ్యో, హాయ్యో! ఎంతలేసి మాటలన్నావమ్మా? పిసరంత లౌక్యంగా మన వృత్తిధర్మం మనం చూసుకోవా లని అన్నానో లేదో, ఎంత బాగా జవాబు చెప్పా వమ్మా? నీ ఇల్లు బంగారమైపోనూ, బుద్ధి వచ్చేట్టు చేశావమ్మా, సావిత్రమ్మా!" అంటూ పనస చదివింది.

"విన్ను నే నేమీ అనలేదు వదినోవ్? అన్నీ నువ్వే అనుకున్నావు. నా బాధ్యతేంలేదు" అంది సావిత్రి మరింత నెమ్మదిగా.

"హాయ్యో, ఇంకా అనాలా తల్లీ? అన్నది చాలదూ? ఆ లెక్కకొస్తే నేను మాత్రం ఏమన్నాను గనక? చేసేది డాక్టరీకదా, వేలకు వేలు కుమ్మరించి చదివిన చదువుకదా, ప్రాక్టీసులో కాస్త ముందూ వెనకా చూసుకోవాలంటే తప్పా? తలకు మించిన దాన ధర్మాలకు పోయి అందరికీ మందులూ, ఇంజక్షన్లూ తేరగా తగలేస్తే ఇల్లు దివాలా తీస్తుందన్నాను. తప్పా? చెప్పవమ్మా తప్పేనంటావా?" అని రెట్టించింది లక్ష్మీకాంతమ్మ.

ఇప్పటిదాకా, ధర్మ సూక్ష్మాన్ని అందుకో లేక అజ్ఞానాంధకారంలో తారట్లాడుతున్న పామర ప్రాణికి మల్లే అయోమయంగా ఉన్న సావిత్రికి అసలు సంగ తేమిటో ఇప్పుడు అర్థమయి పోయింది. ఇప్పు డీవిడ ఇంత రాద్ధాంతం చేస్తున్నదీ లచ్చిమికి తన భర్త ఉచితంగా వైద్యం చేసినందుకేనని గ్రహించింది.

సావిత్రికి నవ్వు వచ్చింది. వెనువెంటనే రవంత జుగుప్స కూడా కలిగింది.

"ప్రాక్టీసూ, డబ్బూ, ఆదాయం—ఇవన్నీ మగవాళ్ళు చూసుకోవలసిన విషయాలు వదినా! ఇంట్లో సామాన్యమైన ఆర్థిక సౌఖ్యానికి లోటు రానంతవరకూ మనం వాటిల్లో తల దూర్చటం తెలివితక్కువైన పని. అయినా నువ్వన్నట్టుగా ఇందులో ఆయన తగలేసిం దేమీలేదు" అంది.

"చాల్లేవమ్మా, చెప్పొచ్చావు! ఆ మాత్రం భర్తను వెనకేసుకు రావటం మాకే తెలిదన్నట్టు!"

"నేనేం వెనకేసుకురాలేదు. అన్ని మాటలూ నువ్వే అంటున్నావు."

"అంటే నువ్వనేది నేను అనవసరంగా మాట్లాడుతున్నా ననేగా?"

"అనని మాటలక్కూడా అలా అర్థాలు కల్పించుకోవటంవల్ల లాభం లేదు వదినా!"

"అర్థాలు తీయటం నా కేం తెలుసమ్మా? అదంతా నీకే తెలియాలి, కాలేజీ చదువులు చదివినదానివి."

ఇలా సాగింది సంభాషణ. సావిత్రి కాలేజీలో చదువుకున్నది కావటంవల్ల, లక్ష్మీకాంతమ్మ ఏ మాటను కానీ దానితో ముడిపెట్టి మాట్లాడుతుంది. ఏతావతా, ఇప్పటి కాలేజీలూ, ఆ కాలేజీల్లో చదువులూ ఎందుకూ పనికి రానివని కూడా సిద్ధాంతీకరిస్తుంటుంది.

ఇది కేవలం నాంది మాత్రమే

ఆ తర్వాత లక్ష్మీకాంతమ్మ తన అస్త్ర విన్యాసం సావిత్రి దగ్గర పని చెయ్యదని తెలుసుకున్నదై, వాకిట్లోకి వచ్చి, అక్కడ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న లచ్చిమి మీదా, రామిగాడిమీదా ఒక్క ఉరుము ఉరిమింది.

వాళ్ళు బెదిరిపోయి కొబ్బరిచెట్టు చాటుకు వెళ్ళి దాక్కున్నారు.

వాళ్ళిద్దరూ ఆ యింట్లో డాక్టరుగారి చిన్న కొడుకు కిష్టాయి పుట్టినప్పట్నుంచీ పని చేస్తున్నారు. ఆ కుటుంబంలో ఒకరుగా కలిసి పోయ్యారు. వాళ్ళు డాక్టరుగారి తల్లితండ్రులు పల్లెటూళ్ళో ఉన్నప్పుడు అక్కడ పని చేస్తుండే వాళ్ళు. అప్పట్లో ఆ యింటి పొలాకు పొలం పనుల్లో రామిగాడు సర్వాధికారి. ఇంటి పనుల్లో పెత్తనం లచ్చిమిది.

కిష్టాయి పుట్టిన తరవాత, ఇంట్లో పిల్లలతోబాటు పనీ పాటా అంతా చూసుకోవటం సావిత్రికి కష్టంగా ఉంటుందని, రామిగాడినీ, లచ్చిమినీ పల్లెటూరునుంచి పిలిపించారు డాక్టరుగారు. తమ కుటుంబం కోసమని ఉన్న ఊరును వదిలిపెట్టి వచ్చినందుకు వాళ్ళిద్దర్నీ ఎంతైనా ఆదరంతో చూస్తుంటారు డాక్టరుగారూ, సావిత్రీ.

ఇది లక్ష్మీకాంతమ్మకు గిట్టదు. ఎవరి హద్దుల్లో వాళ్ళను ఉంచాలంటుంది ఆవిడ.

ఆ రోజున ఆ విధంగా యింట్లో అందరి మీదా శక్తివంచన లేకుండా పురాణం చదివి చివర్ని చనను చూచి భయభక్తులు లేకుండా నవ్విన డాక్టరుగారి పిల్లలిద్దర్నీ తరిమి తరిమి అలసిపోయి ఉన్న లక్ష్మీకాంతమ్మ, మధ్యాహ్నం డాక్టరుగారు ఇంటికి వచ్చేటప్పటికి కూడా తన పొరాయణం రవంత తగ్గుస్థాయిలో కొన సాగిస్తూనే ఉంది.

"ఏమిటి గోల?" అన్నా రాయన, భార్య దగ్గరికి వెళ్ళి. అప్పటిదాకా వదినగారికి మాటకు మాట జవాబు చెప్పిన సావిత్రి కూడా, భర్త ఆ ప్రశ్న వేసేటప్పటికి, మొహం గంటుపెట్టుకుని, మౌనం వహించి కూర్చుంది.

ఇహ యిది పనిగాదని ఆయన పెరట్లోకి వెళ్ళి, అక్కడ క్యారమ్సు ఆడుకుంటున్న లలితనూ, కిష్టాయినీ అడిగి తెలుసుకున్నారు. అక్కా, తమ్ముడూ అంతవరకూ యింట్లో జరిగిన నాటక కథను అభినయపూర్వకంగా విశదం చేశారు డాక్టరుగారికి.

ఆయన ఎవర్నీ ఏమీ అనలేదు.

నవ్వుకున్నారు.

• • •

వారం రోజులు గడిచాయి.

ఆస్పత్రిలో లక్ష్మీకాంతమ్మకు ఆపరేషను జరిగింది. ఆపరేషను జరిగాక పది రోజుల పాటు — పూర్తిగా కోలుకునేవరకూ — ఆవిడ ఆస్పత్రిలోనే ఉన్నది. ఈలోగా అత్తవారింటి నుంచి ఆవిడ భర్త వచ్చి చూసివెళ్ళాడు.

ఈ పది రోజులూ ఆవిడ త్వరగా ఊరి కెళ్ళాలని ఊరికే తొందరపడి పోతూంది.

పదకొండో రోజున ఆవిడను ఆస్పత్రినుంచి డిస్చార్జ్ చేశారు డాక్టరుగారు. ఆ రోజు పొద్దుట పది గంటలకు, డిస్చార్జ్ చేస్తున్నట్టు కాగితం వచ్చింది. ఆ కాగితంతోబాటు ట్రీట్‌మెంటు బిల్లు కూడా చేత పట్టుకువచ్చింది నర్సు కమలమ్మ.

"ఇదేమిటి?" అంది లక్ష్మీకాంతమ్మ ఆశ్చర్యపోతూ. అది మరేదైనా టానిక్కుల ప్రిస్క్రిప్షను అయివుంటుందని సమాధాన పడబోయిం దావిడ.

"బిల్లండీ! డాక్టరుగారు దీన్ని మీ కిచ్చి డబ్బు తీసుకోమ్మన్నారు. బెడ్డుకూ, ఆపరేషనుకూ, డయట్‌కూ అన్నిటికీ కలిపే రాశారు బిల్లు."

అప్పటికీ నమ్మదలుచుకోలేదు లక్ష్మీకాంతమ్మ.

"చాల్లేవమ్మా! నాతో నేమిటి నీ సరసాలు?" అంది.

"నా ఖర్మకాలి మీతోనే సరసా లాడలా నటండీ? దీన్ని డాక్టరుగారు మీ కిమ్మన్నారు. తీసుకుని డబ్బిచ్చేట్టయితే ఇవ్వండి, లేకపోతే ఏ సంగతీ చెప్పెయ్యండి, చంపక" అంది కమలమ్మ.

లక్ష్మీకాంతమ్మ ముఖం నలుపుతిరిగిపోసాగింది. అప్పటికీ అంది:


"అది కాదు కమలమ్మా! ఒకవేళ అన్నయ్య

పండిత
డి. గోపాలాచార్యులవారి
అరుణ
స్త్రీల ఆరోగ్యభాగ్యాలకు

కలం స్నేహితులు కావాలా?
ఒంటరిగానున్న మీకు దేశ విదేశాలలో మిత్రులను సంపాదించి, వివాహ, వ్యాపార, విద్యా, ఆర్థిక, నిరుద్యోగ విషయాలలో సహాయం చేసేందుకు కొంగ్రొత్త రీతులతో వెలసిన మా "స్నేహమంజరి" మీపాలిట కల్పతరువు. 15 న.పై.స్టాంపు పంపుతూ నేడే వివరములకు వ్రాయండి:
స్నే హ మం జ రి.
20/206 ఏ. ఇంగ్లీషుపాలెం,
మచిలీపట్నం.

హెడన్సా

మూలవ్యాధుల
నుండి
త్వరితగతిని
నిరపాయముగ
నివారణ
కలిగిస్తుంది
హెడన్సాతో స్పర్శజ్ఞానము పోగొట్టు మందులేవి లేవు—బిళ్లలకు మరక కాదు.
DZ-1285 TG



ప్రశాంతత — ఫోటో—హెచ్. డబ్ల్యు. న్యూటన్ (డేరాడూన్)

దాన్ని నా పేరుగల మరెవ్వరికైనా ఇమ్మంటే నువ్వు పొరబాటున.....పొరబాటు మానవ సహజం కదా?"

"అలాంటి దేం లేదులెండి, లక్ష్మీకాంతమ్మ గారూ! మీ రనేటంత మతిభ్రష్టత్వం ఇంకా రాలేదు నాకు."

లక్ష్మీకాంతమ్మ కేం పాలుపోలేదు. అసలు బిల్లు చూడగానే కలిగిన ఆశ్చర్యంలోంచి ఆవిడ ఇంకా తేరుకోలేకపోతుంటే, దానికి తోడు కమలమ్మ ఇచ్చే పెలుసు జవాబులు అగ్గిమీద గుగ్గిలంలాగా ఉన్నాయి.

# చికిత్స

"అయితే పదవమ్మా! అన్నయ్యనే అడిగి తేల్చుకుంటాను" అంటూ బయల్దేరింది ఆవిడ.

ఇక ఆ పూటకు ఆస్పత్రి పని ముగించుకుని, ఒంటరిగా కూర్చుని ఏదో రాసుకుంటున్న డాక్టరుగారిని చూస్తూనే, "అన్నయ్యా! ఏదో బిల్లు రాసి పంపించావట, ఎవరికి?" అని అడిగింది లక్ష్మీకాంతమ్మ.

"నీకే లక్ష్మీ!" డాక్టరుగారు తలెత్తకుండానే జవాబిచ్చారు.

"నాకా??"

"ఆఁ నీకే."

"నాకు బిల్లేమిటి?" అంది లక్ష్మీకాంతమ్మ ఏక్కమొహంతో.

"ఆపరేషనుకూ, తతిమ్మా వాటికీని. అలా ఆశ్చర్యపడతా వేమిటి?"

ఆ మాటతో తాటిచెట్టు ప్రమాణాన లేచింది లక్ష్మీకాంతమ్మ.

"ఆశ్చర్యపడక ఏడవమంటావా? ఊళ్ళో అడ్డమైన వాళ్ళందరికీ మాత్రం ఉచితంగా మందులిస్తావు. అలాంటిది ఈ రోజున స్వంత చెల్లెలు వస్తే బిల్లు రాసిచ్చావు. నేను వాళ్ళపాటి చెయ్యలే దన్నమాట!"

"ఆ మాట ఎవరన్నారు?"

"ఇంకా అనాలా? ఆఖరుకు ఆ రామిగాడికీ, లచ్చిమికీ ఉన్న విలువకూడా నాకు లేదన్న మాటేగా?"

డాక్టరుగారు నవ్వారు.

"విలువ లేకపోవటం కాదు, లక్ష్మీ! డబ్బును బట్టి విలువలు నిర్ణయించటం తప్పు. నువ్వు లక్షాధికారి భార్యవు. వాళ్ళు లేనివాళ్ళు. నీలాంటి వాళ్ళు కాస్త ధారాళంగా ముట్టజెబితేనే కదా, అలాంటి వాళ్ళకు ఉచితంగా వైద్యం చెయ్యటం సాధ్యమవుతుంది?"

లక్ష్మీకాంతమ్మకు ఉడుకుమోత్తనం వచ్చింది. "ఇదేనా పెద్దవాళ్ళు నీకు నేర్పింది?" అంది.

"పెద్దవాళ్ళు నేర్పటం కాదు. చూడు, ఆ రోజు లచ్చిమికి ఉచితంగా వైద్యం చేసినందుకు ఊరూ వాడా ఏకం చేశావు. అందువల్ల తాతలనాటి విక్షేపమంతా కరిగిపోయినట్టు మాట్లాడావు. ఇప్పుడు నీకు బిల్లు వేసినందుకే ఇంతగా బాధ పడుతున్నావే—ఆ రోజున తగిన వైద్యంలేక లచ్చిమికి ఏ ప్రమాదమైనా జరిగిఉంటే వాళ్ళెంత బాధ పడేవాళ్ళో ఆలోచించలేదు నువ్వు" అన్నారు డాక్టరుగారు.

"అయితే నీకు డబ్బేగా కావాల్సింది? వెధవ డబ్బు! ఎంత కావాలో చెప్పు."

పలచగా, స్వచ్ఛంగా మెరిసే కళ్ళద్దాల్లోంచి మళ్ళీ నవ్వారు డాక్టరుగారు.

"ఎంతో దేనికి? బిల్లులో వేసినంతే."

లక్ష్మీకాంతమ్మ బొడ్లోనుంచి నోట్ల కట్ట తీసి లెక్కపెట్టి బల్లమీద పడేసి విసవిసా వెళ్ళిపోయింది.

ఆ రోజు సాయంకాలమే ఆవిడ అత్తవారింటికి ప్రయాణం. ఆవిడ అంత హడావిడిగా ప్రయాణం కావటానికి కారణం ఇంట్లో ఎవ్వరికీ — చివరికి సావిత్రికి కూడా — చెప్పలేదు డాక్టరుగారు. ★